క్లుప్తంగా

భక్తులకు అసౌకర్యం కలిగించొద్దు



పటమట(విజయవాడ తూర్పు): మహాశివ రాత్రి పండుగకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకూడదని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మహా శివరాత్రి పండుగకు వచ్చే భక్తులకు ఘాట్ల వద్ద జల్లు స్నానాలకు, తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు, వస్త్రాలు మార్చుకునేందుకు తాత్కాలిక రూములు, పారిశుద్ధ్యంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. డ్రోన్ల సాయంతో నిరంతరం పరిశీలిస్తూ అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో శాఖాధిపతులు ప్రజారోగ్య సిబ్బంది, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

శివరాత్రికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

బస్టాండ్(విజయవాడపశ్చిమ): శివరాత్రిని పురస్కరించుకుని ప్రజా రవాణా సంస్థ (ఏపీఎస్ ఆర్టీసీ) ఎన్టీఆర్ జిల్లాలోని అన్ని డిపోల నుంచి పలు శైవక్షేత్రాలకు ప్రత్యేక సర్వీసులను నడుపుతున్నట్లు జిల్లా డెప్యూటీ ట్రాఫిక్ మేనేజర్ జాన్ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. జగ్గయ్యపేట నుంచి ముక్త్యాలకు 23 బస్సులు, కోదాడకు రెండు బస్సులు, నందిగామ కూడలికి రెండు బస్సులు, తిరువూరు నుంచి నీలాద్రికి 15 బస్సులు, గుట్టపాడుకు మూడు బస్సులు, ఇబ్రహీంపట్నం నుంచి పవిత్ర సంగమంనకు రెండు బస్సులు, మైలవరం నుంచి పవిత్ర సంగమానికి ఐదు బస్సులు, కొండపల్లి నుంచి మూడు బస్సులు, విజయవాడ నుంచి శ్రీశైలానికి 20 బస్సులు, అమరావతికి 15 బస్సులు, భీమవరానికి రెండు బస్సుల చొప్పున మొత్తం 90 ప్రత్యేక బస్సులను ఈ నెల 26వ తేదీన శైవక్షేత్రాలకు నడపనున్నట్లు తెలిపారు. కోటప్పకొండకు ప్రత్యేక బస్సులను నడిపేందుకు జిల్లా నుంచి 43 బస్సులను గుంటూరు జిల్లాకు పంపించినట్లు తెలిపారు.

అంగరంగ వైభవంగా శివరాత్రి మహోత్సవాలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): స్థానిక భీమన వారి పేటలో వేంచేసిన శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో మంగళవారం నుంచి మహా శివరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలలో భాగంగా ఉదయం విజయదుర్గ, రామలింగేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులకు పంచామృత అభిషేకాలు, అర్చనలు, మంగళ స్నానాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని, అమ్మవార్లను పెళ్లికుమారుడు, పెళ్లికుమార్తెగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని కళ్యాణ వేదిక వద్ద నిర్వహించిన పెళ్లి వేడుకకు పెద్ద ఎత్తున ఉభయదాతలు, భక్తులు తరలి వచ్చారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, పవన్‌కుమార్ శర్మ శాస్త్రోక్తంగా జరిపించారు.

సమస్యలను పరిష్కరించే నాయకుడిని గెలిపించండి



భవానీపురం(విజయవాడపశ్చిమ): సమస్యలపై పోరాడే వారిని కాకుండా వాటిని పరిష్కరించేందుకు కృషి చేసి నాయకుడిని గెలిపించాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఉపాధ్యాయులను కోరారు. ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం విద్యాధరపురంలోని ఒక ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయులతో ఎంపీ సమావేశమయ్యారు. పోలింగ్‌లో మొదటి ప్రాధాన్యత ఓటు ఎలా వేయాలో వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బుద్ధా వెంకన్న, నాగుల్ మీరా, ఎంఎస్ బేగ్, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

న్యాయవాది ఒగ్గు గవాస్కర్‌కు సుప్రీంకోర్టులో బెయిల్

విజయవాడలీగల్: టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడిలో అక్రమంగా బనాయించిన కేసులో న్యాయవాది ఒగ్గు గవాస్కర్‌కు బెయిల్ లభించింది. సుప్రీంకోర్టులో వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులతో పాటు వైఎస్సార్ లీగల్ జోనల్ ఇన్‌చార్జి, న్యాయవాది ఒగ్గు గవాస్కర్‌కు బెయిల్ లభించడంతో న్యాయవాదులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రజలకు న్యాయంచేసే వృత్తిలో కొనసాగే న్యాయవాదులపైన అక్రమ కేసులు బనాయించడం రాజ్యాంగ విరుద్ధమని ఈ తీర్పు తెలియజేసిందన్నారు. న్యాయవాది అక్రమ అరెస్టును ఖండిస్తూ 2024 జూన్, జూలై నెలల్లో రాష్ట్రంలోని అన్ని బార్ అసోసియేషన్లు నిరసనలు చేశాయి. ఇకనైనా కూటమి ప్రభుత్వం న్యాయవాదుల పట్ల ఇటువంటి దుర్మార్గపు చర్యలను అరికట్టాలని గవాస్కర్ పేర్కొన్నారు.

కూర్చోలేం.. నిలబడలేం

- ప్రయాణికుల ఇబ్బందులను పట్టించుకోని ఆర్టీసీ అధికారులు
- రైల్వే వెస్ట్‌బుకింగ్, ఏలూరు లాకుల వద్ద కనిపించని బస్‌షెల్టర్లు
- ఎండైనా, వానైనా రోడ్డు పక్కనే బస్సుల కోసం ఎదురుచూపులు



ఏలూరు లాకులు సెంటర్‌లో బస్సుల కోసం ఎండలో వేచివున్న ప్రయాణికులు

బస్టాండ్(విజయవాడ పశ్చిమ): రైల్వే వెస్ట్‌బుకింగ్, ఏలూరు లాకులు తదితర ప్రాంతాల్లో బస్ షెల్టర్లు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎండైనా, వానైనా రోడ్డు పక్కనే బస్సుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి తప్పడంలేదు. బస్ షెల్టర్ ఉంటే బస్సు రావడం ఆలస్యమైనా కొద్దిసేపు కూర్చునేందుకు వీలు ఉంటుంది. బస్ షెల్టర్లు లేకపోవడంతో బస్సులు వచ్చే వరకు నిలబడే ఉండాల్సి వస్తోంది. దీంతో చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వసతులు కల్పించని ఆర్టీసీ

అతి పెద్ద ప్రజా రవాణా సంస్థల్లో ఒకటిగా పేరు పొందిన ఆర్టీసీ ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించటంలో మాత్రం పూర్తిగా విఫలమైందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి నెలా కోట్ల రూపాయల ఆదాయన్ని సంస్థకు అందిస్తున్న తమకు సరైన సౌకర్యాలు కల్పించడంలో సంస్థ అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. సౌకర్యవంతమైన, సురక్షిత ప్రయాణాన్ని అందించేందుకు సంస్థ ఎటువంటి చర్యలూ తీసుకోవడంలేదని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో పేదల బస్సుగా పేరుపొందిన ఆర్టీసీ బస్సులు నేడు పేద, మధ్య తరగతి ప్రజలకు క్రమంగా దూరమవుతున్నాయని సంస్థ సిబ్బందే పేర్కొంటున్నారు.

కనిపించని బస్ షెల్టర్లు

నగరంలో తిరిగే సిటీ బస్సుల్లో కొన్ని రూట్ల నుంచి ఆర్టీసీకి అత్యధిక ఆదాయం వస్తోంది. రాజీవ్‌నగర్, కండ్రిక, వాంబేకాలనీ, సింగ్‌నగర్ మీదుగా ఆటోనగర్‌కు వెళ్లే (నంబర్ 48) బస్సులు, మిల్క్ ప్రాజెక్టు (నంబరు 31), చిట్టినగర్ నుంచి ఆటోనగర్, గవర్నమెంట్ ప్రెస్ మధ్య రాకపోకలు సాగించే (నంబరు 3) బస్సులు ఉదయం నుంచి రాత్రి వరకు నిత్యం రద్దీగా నడుస్తుంటాయి. ఈ బస్సుల్లో ప్రయాణించాలంటే ప్రయాణికులు పడే పాట్లు వర్ణనాతీతంగా ఉన్నాయి. కోట్లది రూపాయల ఆదాయం ఇస్తున్న తమకు సరైన సౌకర్యాలు కల్పించటంలేదని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. ఈ రూట్‌లలో పలు ముఖ్యమైన ప్రాంతాల్లో బస్‌షెల్టర్లు లేకపోవడంతో నిలువ నీడ లేక ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ బస్సుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొందని వివరిస్తున్నారు.

నిత్యం వేల సంఖ్యలో ప్రయాణికులు

నిత్యం వేల సంఖ్యలో ప్రయాణికులు నగరంలోని పలు ప్రాంతాల నుంచి ఆటోనగర్, ఏలూరు రోడ్డు, ప్రభుత్వాస్పత్రి, కాళేశ్వరరావు మార్కెట్‌కు ప్రయాణిస్తుంటారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రూట్‌లో వెస్ట్ రైల్వేబుకింగ్ కార్యాలయం, తారాపేట, ఏలూరు లాకులు వద్ద బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయకపోవడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎండలో బస్సుల కోసం నిరీక్షించలేక తప్పని సరి పరిస్థితుల్లో ఆటోలను ఆశ్రయించక తప్పడంలేదని పేర్కొంటున్నారు.

వేసవిలో మరిన్ని తిప్పలు



బస్ షెల్టర్లు లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రస్తుతం ఎండలను తట్టుకుని బస్సుల కోసం రోడ్డు పక్కన నిరీక్షిస్తున్నాం. ఇక వేసవి వచ్చిందంటే ఎండలు మండుతాయి. ఆ ఎండల్లో బస్సుల కోసం ఎదురుచూడాలంటే కష్టం. ఆ పరిస్థితిని ఊహించుకుంటేనే భయమేస్తోంది. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలి.

– కొండారెడ్డి, ప్రయాణికుడు

మహాశివరాత్రికి చురుకుగా ఏర్పాట్లు



నల్లమందు వీధిలో ఏర్పాటు చేసిన బారికేడ్లు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): స్థానిక శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం)లో బుధవారం జరిగే మహాశివరాత్రి వేడుకలకు చురుకుగా ఏర్పాట్లు చేస్తున్నారు. పండుగ రోజు భక్తులు దుర్గాఘాట్‌లో పవిత్ర స్నానాలు ఆచరించి పాతశివాలయంలోని మల్లేశ్వరస్వామి వారిని దర్శించుకోవడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో దేవస్థానం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. కెనాల్ రోడ్డు నుంచి నల్లమందు వీధి మీదుగా ఆలయంలోకి క్యూలైన్లను ఏర్పాటు చేశారు. బారికేడింగ్ సామగ్రిని తీసుకొచ్చి ఆలయం లోపల సైతం పటిష్టంగా క్యూలైన్లను ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ అన్నప్రసాద వితరణకు వివిధ సంస్థలు, దాతల సాయంతో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ఆధ్వర్యంలో విస్తృత బందోబస్తుకు చర్యలు తీసుకున్నారు. మంగళవారం రాత్రి నుంచి సిబ్బంది విధుల్లో ఉండే విధంగా ఆదేశాలు జారీ చేశారు. శివాలయం వీధి, బ్రాహ్మణ వీధి, కెనాల్ రోడ్డు తదితర ప్రాంతాల్లోనూ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వన్‌టౌన్‌లోని వివిధ ఆలయాల్లో ఏర్పాట్లు

వన్‌టౌన్ కొత్తపేట సైకంవారి వీధిలో వేంచేసి ఉన్న శ్రీదర్వేశ్వరస్వామి వారి దేవస్థానం, పంజా సెంటర్ సమీపంలోని హనుమత్ ఆలయంలో వేంచేసి ఉన్న కాశీవిశ్వేశ్వరస్వామి వారి దేవస్థానం, రామ్‌గోపాల్ సత్రంలోని విశ్వేశ్వరస్వామి ఆలయం, కేటీ రోడ్డులోని రామలింగేశ్వరస్వామి దేవస్థానం (గంగానమ్మ దేవస్థానం), కొత్తపేట ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానం తదితర ఆలయాల్లోనూ మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. తెల్లవారుజాము నుంచి భక్తులు పోటెత్తే అవకాశం ఉండటంతో ఆయా ఆలయాల నిర్వాహకులు ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

విద్యార్థులు తమ రంగాల్లో పట్టుసాధించాలి



లోకోషెడ్డును పరిశీలిస్తున్న విద్యార్థులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు తమ తమ రంగాల్లో పట్టు సాధించాలని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శరవణకుమార్ సూచించారు. కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం విద్యార్థులు ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా మంగళవారం విజయవాడ రైల్వే లోకోషెడ్డును పరిశీలించారు. మేనేజమెంట్ స్టడీస్ విభాగం విద్యార్థులు ఏలూరులోని అంబిక అగర్‌బత్తి పరిశ్రమను సందర్శించారు. ఈ సందర్భంగా టూర్‌ను ప్రారంభించిన ప్రిన్సిపాల్ డాక్టర్ శరవణ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు తమతమ రంగాలకు అనుబంధ పరిశ్రమలు, ఆయా రంగాలకు చెందిన అంశాలపై పట్టు సాధించాలన్నారు. లోకోషెడ్డును పరిశీలించిన విద్యార్థులు రైల్వే అంశాలపై సబంధిత అధికారుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంబిక అగర్‌బత్తి పరిశ్రమను పరిశీలించిన విద్యార్థులు అక్కడి ఉత్పత్తులు, పోటి పరిశ్రమ, మార్కెటింగ్ పరిస్థితుల తదితర అంశాలపై వివరాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు డాక్టర్ ఎస్.మణికంఠ, డాక్టర్ కె.సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పుణ్యస్నానాలకు విస్తృత ఏర్పాట్లు



పున్నమిఘాట్‌లో జల్లు స్నానాల ఏర్పాట్లు



భవానీఘాట్‌లో ఏర్పాటు చేసిన తాత్కాలిక మరుగుదొడ్లు



పున్నమిఘాట్‌లో షామియానాల ఏర్పాటు

భవానీపురం(విజయవాడపశ్చిమ): మహా శివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు కృష్ణా నదిలో పుణ్య స్నానాలు ఆచరించేందుకు విద్యాధరపురం, భవానీపురంలోని ఘాట్లలో నగర పాక సంస్థ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. విద్యాధర పురం పరిధిలోని పున్నమి హోటల్ పక్కన ఉన్న వీఐపీ ఘాట్, భవానీపురం పరిధిలోని పున్నమి, భవానీ ఘాట్లలో భక్తుల సౌకర్యార్థం కార్పొరేషన్ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఆయా ఘాట్లను శుభ్రం చేయడంతోపాటు కృష్ణానదిలో భక్తులు దిగకుండా జల్లు స్నానాల కోసం పైపులను ఏర్పాటు చేశారు. వాటి కోసం ప్రత్యేకంగా ఇంజిన్లను సిద్ధం చేశారు. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు, ఉచిత వైద్య శిబిరం, తాగు నీరు, మరుగుదొడ్లు వంటి ఏర్పాట్లు చేశారు. భక్తులు నదిలో దిగి స్నానాలు చేయవద్దని జలవనరుల శాఖ సౌజన్యంతో భవానీపురం పోలీసులు బోర్డులు ఏర్పాటు చేశారు. ఘాట్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసేందుకు అదనపు పారిశుద్ధ్య కార్మికులను నియమించారు.

వ్యర్థాల తొలగింపునకు ట్రాక్టర్ యజమానులతో ఒప్పందం



ట్రాక్టర్ యజమానులతో సమావేశమైన అధికారులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలో ఎప్పటికప్పుడు నిర్మాణాల వ్యర్థాల తొలగించాలన్న మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు ప్రైవేట్ ట్రాక్టర్ యజమానులతో అవగాహన ఒప్పందం కోసం సిస్టెంట్ సిటీ ప్లానర్లు మంగళవారం వేర్వేరు సర్కిల్ కార్యాలయాల్లో సమావేశాలు నిర్వహించారు. నగరంలోని వివిధ వీధుల్లో నిల్వ ఉన్న భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించేందుకు రవాణా ట్రాక్టర్ల యజమానులతో చర్చించారు. నగరపాలక సంస్థ ఇచ్చే సమాచారం ప్రకారం వాటి తొలగింపునకు వారి సమక్షంలో భవన యజమానులతో మాట్లాడి సహేతుకమైన ధరపై చర్చించారు. ఈ అవగాహన ఒప్పందంలోని షరతుల ప్రకారం ఉదయం ఆరు గంటల నుంచి కార్మికులు సహా ట్రాక్టర్ అందుబాటులో ఉండాలని అధికారులు సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న డ్రైవర్లు మాత్రమే ట్రాక్టర్ నడపాలని, తొలగించిన వ్యర్థాలను నిర్దేశించిన ప్రాంతంలోనే డంప్ చేయాలని స్పష్టంచేశారు. కాలువల్లో, శివారు ప్రాంత రోడ్ల పక్కన డంప్‌చేస్తే రూ.5 వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. నోడల్ ఆఫీసర్ తెలియచేసిన 24 గంటల్లో వ్యర్థాలను తొలగించాలని సూచించారు. సమావేశంలో డెప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ రాంబాబు, మోహన్‌బాబు, రవాణా ట్రాక్టర్ల యజమానులు పాల్గొన్నారు.

సంగీతంలో మనోధర్మానికి విశిష్టమైన స్థానం



విజయవాడకల్చరల్: కర్ణాటక సంగీతంలో మనో ధర్మానికి విశిష్టమైన స్థానముందని సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ అన్నారు. స్వర తరంగిణి ఆధ్వర్యంలో నెల వారీ కార్యక్రమంలో భాగంగా దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో మంగళవారం రాగం తానం పల్లవి అంశంగా ప్రత్యేక ప్రసంగ కార్యక్రమం నిర్వహించారు. సుధాకర్ మాట్లాడుతూ కర్ణాటక సంగీత ప్రపంచంలో ప్రపంచ సంగీత రీతుల్లో విశిష్టత పొందటానికి ప్రధాన కారణం మనోధర్మ సంగీతమేనన్నారు. రాగం, నెరవల్, తానం పల్లవి స్వర ప్రస్తారం మొదలైనవి మనోధర్మ అంశాలని వివరించారు. రాగం, తానం, పల్లవి ఒక అవధాన ప్రక్రియగా భావించాలన్నారు. కార్యక్రమం స్వరతంగిణి నిర్వాహకులు గండూరి శ్రీనివాసమూర్తి, రమా సత్యనారాయణ, సంగీత విద్వాంసురాలు అంజనా సుధాకర్ పాల్గొన్నారు.

నేడు అఖండ నాదార్చన

మహాశివరాత్రి సందర్భంగా స్వరఝరి ఆధ్వర్యంలో అఖండ నాదార్చన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంగీత విద్వాంసుడు సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గవర్నర్‌పేట శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో ఉదయం తొమ్మిది నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు నాదార్చన నిర్వహిస్తామన్నారు. గజల్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. 12 గంటల పాటు జరిగే నాదార్చనలో వివిధ ప్రాంతాలకు చెందిన సంగీత విద్వాంసులు పాల్గొంటారని తెలిపారు.

రావణబ్రహ్మ వాహనంపై ముక్కంటి



వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): రావణ బ్రహ్మ వాహనంపై శ్రీ గంగ, భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వార్లు నగర వీధుల్లో భక్తులకు కనువిందు చేశారు. విజయవాడ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, శ్రీ వసంత మల్లికార్జునస్వామి వార్ల దేవస్థానాలకు చెందిన స్వామి వార్ల ఉత్సవమూర్తులతో మంగళవారం సాయంత్రం నగరోత్సవం నిర్వహించారు. రావణబ్రహ్మ వాహనంపై స్వామి వారు, వివిధ వాహనాలపై గంగాదేవి, భ్రమరాంబ అమ్మవార్లు ఊరేగారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు అనంతరం ఉత్సవమూర్తులను రమణీయంగా అలంకరించిన వాహనాలపై అధిష్టింపజేశారు. మేళతాళాలు, బేతాళ నృత్యాలు, మంగళవాయిద్యాల నడుమ నగరోత్సవం కనుల పండువగా సాగింది. తొలుత ఆలయంలో స్వామి వారికి 108 కలశాలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నగరోత్సవాన్ని ప్రారంభించారు. పాతశివాలయం ప్రాంగణం నుంచి బయలుదేరిన స్వామి వారి నగరోత్సవం కాళేశ్వరరావు మార్కెట్ సెంటర్, బీఆర్పీరోడ్డు తదితర ప్రాంతాల మీదుగా ముందుకు సాగింది. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నగర ప్రముఖులు, జిల్లా ప్రముఖులు విశ్వబ్రాహ్మణ సంఘానికి సంబంధించి వివిధ అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వంశీ కస్టడీలో కోర్టు ఆదేశాలు ఉల్లంఘిస్తున్న పోలీసులు

విజయవాడలీగల్: గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ కస్టడీ వ్యవహారంలో పోలీసులు తమకు సరైన సమాచారం ఇవ్వలేదని, కోర్టు ఆదేశాలను ఉల్లంఘించారంటూ వంశీ తరపు న్యాయవాది తానికొండ చిరంజీవి విజయవాడ ఎస్సీ, ఎస్టీ కోర్టులో మంగళవారం పిటిషన్ దాఖలు చేశారు. కస్టడీకి తీసుకునేటప్పుడు వంశీ తరుపు న్యాయవాదులకు సమాచారం ఇవ్వాలనే కోర్టు ఆదేశాలను విచారణ చేసే పోలీసు అధికారులు పాటించడం లేదన్నారు. ఉద్దేశపూర్వకంగానే పోలీసులు సమాచారం ఇవ్వలేదని, విచారణ సమయంలో న్యాయవాదులను రోజుకు మూడు నుంచి నాలుగు పర్యాయాలు అనుమతించాలని కోర్టు ఇచ్చిన ఆదేశాలను సైతం పాటించలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. కోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తున్న పోలీసు అధికారిపై కంటెంట్ ఆఫ్ కోర్టు కింద చర్యలు తీసుకుని, వంశీ కస్టడీని రద్దు చేయాలని పిటీషన్‌లో న్యాయవాది తానికొండ చిరంజీవి న్యాయస్థానాన్ని కోరారు.

పారిశ్రామికవేత్తలుగా మహిళలు ఎదగాలి



లబ్బీపేట(విజయవాడతూర్పు): మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగడానికి అనేక అవకాశాలు ఉన్నాయని సిడ్బీ డీజీఎం రాజేంద్ర ప్రసాద్ అన్నారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంట్రప్రెన్యూర్స్ ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ, సిడ్బీ సహకారంతో క్రెడిట్ గ్యారంటీ ఫండ్ ట్రస్టు ఫర్ మైక్రో అండ్ స్మాల్ ఎంటర్‌ప్రైజెస్‌పై మంగళవారం అవగాహన సదస్సు జరిగింది. ఎంజీ రోడ్డులోని ఓ హోటల్‌లో జరిగిన సదస్సులో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ క్రెడిట్ గ్యారంటీ ఫంట్ ట్రస్ట్ ఫర్ మైక్రో అండ్ స్మాల్ ఎంటర్ ప్రైజెస్ స్కీములపై ఔత్సాహిక మహిళా పారిశ్రామిక వేత్తలకు అవగాహన కలిగించారు. కేంద్ర పథకాలతో ఈ స్కీము ద్వారా పరిశ్రమలు నెలకొల్పాలనుకునే వారు సులభంగా రుణం పొందవచ్చన్నారు. బ్యాంక్ సెక్యూరిటీ ఇవ్వలేని పారిశ్రామికవేత్తలకు ఈ పథకం ద్వారా రుణాలు పొందవచ్చని, ఏటా ప్రీమియం కట్టాలన్నారు. ఎంఎస్ఎంఈ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.సుదర్శన్‌బాబు మాట్లాడుతూ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు తమ శాఖ ద్వారా అందించే సేవలను వివరించారు. సదస్సులో యూనియన్ బ్యాంక్ జనరల్ మేనేజర్ వెంకటేశ్వరరావు, ఆ బ్యాంక్ అగ్రికల్చర్ ఆఫీసర్ వసంత్, సీజీటీఎంఎస్ఇ ఏపీ చాప్టర్ ప్రెసిడెంట్ రాధిక, సీఓడబ్ల్యూఈ కోశాధికారి అపర్ణ, రాజామణి, మాలతి తదితరులు పాల్గొన్నారు.

వంకర పాదాలకు చికిత్సలపై అవగాహన

లబ్బీపేట(విజయవాడతూర్పు): అమెరికాకు చెందిన ప్రముఖ వంకర పాదాల చికిత్స నిపుణుడు బ్రూస్ స్మిత్ మంగళవారం జీజీహెచ్‌లో ఎముకల విభాగాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వంకర పాదాలను సరిదిద్దేందుకు పొన్సెట్టి కాస్ట్ మెథడ్ అమలుపై వైద్యులకు సూచనలు ఇచ్చారు. కొందరు వంకర పాదాలు కలిగిన పిల్లలకు కట్లు కట్టి చూపించారు. వంకర పాదాలను సరిదిద్దడానికి జీజీహెచ్‌లో చేపడుతున్న చికిత్సల పట్ల సంతృప్తి వ్యక్తం చేసి, వైద్యులను అభినందించారు. అప్పుడే పుట్టిన పిల్లల నుంచి ఐదేళ్లలోపు పిల్లలు వంకర పాదాలతో ఉంటే క్యూర్ ఇంటర్నేషనల్ ఇండియా ట్రస్ట్ హెల్ప్‌లైన్ నంబర్ 88000 20503కి కాల్ చేస్తే, మంగళ, బుధవారాల్లో ఆర్థోపెడిక్ ఓపీలో ఉచిత చికిత్స అందిస్తున్నట్లు ఇక్కడి వైద్యులు ఆయనకు వివరించారు. అనంతరం వైద్య విద్యార్థులకు పొన్సెట్టి మెథడ్‌పై తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. అశోక్‌కుమార్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు, ఆర్థోపెడిక్ హెచ్‌ఓడీ డాక్టర్ సి.శ్యామ్‌కుమార్, ప్రొఫెసర్ డాక్టర్ అద్దెపల్లి శ్రీనివాసరావు, ఇతర వైద్యులు, పీజీలు, క్యూర్ ఇండియా స్టేట్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ శిరీష పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



శాస్త్రవేత్త మధుసూదనరావు

లబ్బీపేట(విజయవాడతూర్పు): సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలు వాటిని ఎదుర్కోవడానికి ఉత్తమ చర్యలు అనే అంశంపై మంగళవారం ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలలో సదస్సు జరిగింది. నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్‌కు చెందిన శాస్త్రవేత్త ఎస్.మధుసూదనరావు వైద్యులు, వైద్య సిబ్బందికి అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో వ్యక్తిగత సమాచారం గోప్యతను కాపాడుకోవడం, ఆన్‌లైన్ ఆర్థిక లావాదేవీల్లో జాగ్రత్తలు పాటించడం వంటి వాటిపై అవగాహన కలిగించారు. సురక్షిత ఇంటర్నెట్ వినియోగానికి అనుసరించాల్సిన ఉత్తమ పద్ధతులను వివరించారు. ఫిషింగ్, సైబర్ బులియింగ్, ఆన్‌లైన్ మోసాలు వంటి సాధారణ సైబర్ ముప్పులపై లోతైన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. అశోక్‌కుమార్, సైబర్ సెక్యూరిటీ నిపుణులు ఎఫ్.వినయ్, డి.కిరణ్ కుమార్, డాక్టర్ పి.వి.ఎస్.ఎస్. గంగాధర్, డాక్టర్ సత్యకిషోర్ తదితరులు పాల్గొన్నారు.